
# శెట్టిపల్లి గీతాలు

(స్మారక సంపుటము)



2
అణాలు

*

సంపాదకులు
ఆచార్య రంగా

# శెట్టిపల్లి గీతాలు

ఆ చా ర్య రం గా

సంపాదకులు

ప్ర కా శ కు లు :

ఆంధ్ర రైతాంగ గ్రంధమాల

గుడివాడ.

బ్రాంచి: రామానీడు విద్యాలయం, నిడుబ్రోలు.

రైతాంగ గ్రంథమాల: **6** వ పుష్పం

1 డిశెంబరు 1939

ఉదయిని ప్రెస్.

**57** వరదాముత్తియప్పన్ వీధి,

మద్రాస్, జి. టి.

# మన శెట్టిపల్లి

"గోభూమి" కి వచ్చినాడు శెట్టిపల్లి. ఆయనవ స్తేసరి పండుగనాకు భారతీదేవికి, మా అమ్మాయి, సుశీలాదేవికి! మేమందరం ఆ బుట్టలమీద కూర్చున్నాం. ఆతడా బెంచీమీదకూర్చుని ఏవేవోమాటలు చెప్పుతూ, మధ్య మధ్య పకపకా నవ్వుతుంటే, ఎంతటి ఆనందమును, సౌఖ్యాన్ని వుపారును మేమంతా పొందితిమి. అరమరలేకుండా, నిండు యావ్వనంపుశక్తితో, విప్లవకాలపు ధాటితో ఆతడు పల్కుతుంటే మ్రోగిన ఆ "కంచు నినాద మునకు" సరిపోయేది కంచిలోని 'గణగణ' మనే గంటానినాదమే నుమండి.

## ఆంధ్రుల ఆదరణ

ఆంధ్రులు ఆదరించుటకు వెనుదీస్తారన్నాడు. పత్రికలకువ్రాస్తే చదువుతారు, కాని చెల్లింపరట. పుస్తకాలువ్రాస్తే పొగుడుతారు, మరికొనరు. డబ్బివ్వండి, కామ్రేడ్సుకైనా పుస్తకాలను, పత్రికలను యివ్వరాదు అంటున్నాడు. పుస్తకాలు, పత్రికలు అమ్ముట యెంతటి జాతీయసేవయో మనవారు అంతగా గ్రహించలేదన్నాడు. ఐతే మీరు, రైతాంగ గ్రంథమాలను నడుపుచున్నారనా, పుస్తకాలను, పత్రికలను అమ్ముతున్నారనా అట్లా మాట్లాడుచున్నారని అన్నది మా అమ్మాయి. "తప్పక అంతే! పుస్తకాలను కొనకపోతే, వ్రాసేవారికి తిండియేది? అచ్చువేసి ప్రకటించేవాళ్లకు వరుమానమేది? ఎన్ని గ్రంథమాలలు అదృశ్యమైపోయాయి. యెందరు గ్రంథకర్తలు

దివాళా తీశారు. రంగాగారు కవులు వ్రాయడంలేదో అంటారు. ఎట్లా వ్రాస్తారు వాళ్లు, తిండే పెట్టువారే లేకపోతే" అన్నాడు.

"డబ్బుమాకొరకు, మేము దేశంకొరకు"

"ఎంతసేపున్నా డబ్బులు, డబ్బులో అంటారేమండి, సోషలిస్టులకుకూడానా యీ ధోరణి" అని ఛలోక్తిచేసింది మాబిడ్డ.

"అవును, డబ్బు, మాస్వార్థం, మాకొరకు, మేము దేశంకొరకు" అనిరి. ఆ కమ్మనిమాట, ఆ యరమరలేని దేశాభిమానతత్పరత ఎన్నటికైన ఎవ్వరమైన మరువగలమా ? అంతటిమాట పల్కు అర్హత శెట్టిపల్లికి పూర్తిగా కలదు.

ఆ మాటలను చావుకు మూడువారాలముందే పల్కిరి. అదియే మనందరికి అంత్యసందేశంగా తెలియకనే తెల్పిరి కాబోలు.

శెట్టి పల్లి మేము బర్మాకు మరొక్కదినానికి బైలుదేరుతామనగా, అంటె 1939 జూలై 4 తేదీన మాకొక్క సంగతి వ్రాసినాడు, తనకు నలభైరూపాయల అదాయం కల్గుచుండేనట. పత్రికలు అమ్ముతున్నవట, యిక భోజనానికి దిగులులేదు. ఆ కుబేరుడినైనా ధిక్కరించుతానన్నాడు. పెండ్లిచేసుకుందామాయను కోరిక కల్గుచున్నదట. "వితంతువునే వెతకండి" అని భారతీదేవిని కోరినాడు.

ఆ దౌర్భాగ్యపు టైఫాయిడు (విషజ్వరపు) నోటపడినాడు. తనకాసంగతి యింకా తెలియులేదు. "త్రిపురీసమస్య"యనే గ్రంధాన్ని పూర్తిచేస్తుంటినని, ఫార్వర్డు బ్లాకుయొక్క ఆశయాలగూర్చి, స్వరాజ్య సంరంభము వెన్వెంటనే సాగించవలసిన అవసరాన్ని తెల్పుచూ "వాహిని"కి మరొక్క వ్యాసం వ్రాయబోతున్నానని వ్రాసినాడు. ఏదో సాధారణ జ్వరంకదాయనుకొని, బెజవాడకు వెళ్లినవాడను గుడివాడ వెళ్లకుంటి ! అదియే నా దురదృష్టము. ఆ పిమ్మట బర్మాకు వెళ్లితి; తిరిగివచ్చుసరికి, "శెట్టిపల్లి" యీలోకంలో లేడన్నారు. నా విచారానికి అంతుకలదా ?

యీనాటికి శెట్టిపల్లి పల్కులలో ఏది తలంపుకొచ్చినా, ఏదో కొండంత రైతాంగశక్తి మనల విడచిపోయిందనేగాఢ భాధకల్గుతుంది.

## ప్రధమ పరిచయం

ఆయన్నారెండవ ఆంధ్రరాష్ట్ర జమీన్‌రైతు మహాసభలో 1933 సెప్టెంబరునందు ఏలూరులో కలుసుకొంటిమి. వుత్సాహుడైన కుర్రవాడను కొంటిమి. ఏవో పాటలు పాడతానన్నాడు: పాడినాడు. యీనాడు ఆంధ్ర రైతుకూలీల హృదయాల్లో ఆశాలతలవెల్లి విరియింపచేస్తున్న "ఆగునా జీవాలు, సాగునా లోకాలు, రాజుగా మనమెంచి రైతుజూడకపోతే" అను "విప్లవ సవాలు" గీతాన్ని విసరినాడు మాపైకి! యింకా బలపడకపోబట్టియో, ఆనాటి వాతావరణం సుముఖంగా లేకుండుటచేతనో, సభకంత నూతనకాంతుల కల్గించలేకపోయెను మన శెట్టిపల్లి. 1934 లో "రైతు భజనావళి"కి పాటల నాహ్వానించితిమి. వచ్చినవి శెట్టిపల్లి గీతాలు. కాప్రమేడు నన్నపనేని వెంకట సుబ్బయ్య పాడినాడు "ఆగునా జీవాలు" అనే సవాలును. ఆనాటినుండి యీనాటివరకు రైతుభజనావళికేగాక, ఆంధ్ర రైతాంగవుద్యమానికే సవాలు గీతమైనదా శెట్టిపల్లి పల్కు.

అడిగిరి భారతీదేవి ఆపాట నెప్పుడు వ్రాసితివని! చెన్నపట్టణంలో సముద్రతీరానవుండి వోసాయంత్రం అట్టె రాగాల తీస్తుంటె, పిల్లపైరులు తలంపునకొచ్చెనట; పొలికేకలు వినవచ్చెనట; యీబస్తీలకు గతియేమి? యీ ధనికుల జీవితమెటుల? మా రైతులకు పట్టంకట్టకపోతే అని తోచిందట. ఆభావముద్రనుండి వెల్వడించే విప్లవకారకపాట; మరికేక!

## అన్యాయాన్నీ, అధర్మాన్నీ సహించలేడు

బహులడాయికోరు. కోపానికి అంతువుండేదికాదు. అయితే అన్యాయాలకు ఓర్వడు; అధర్మాన్ని కాలరాస్తానంటాడు. గాంధియుగంలో అహింసాధోరణే; కాని మరోకాలంలోనైతే అభిమన్యునికే కాంతులు కల్గించగలడు. ఆ "పోలికేకలు" యీనాటి వాళ్ల వేకావు. పై అంగిలి

కన్నదేంత బలంగా చర్చించుట ధర్మతత్పరతగల ఆతనివంటి వారికే సాధ్యమూ యిక తిరుగబడ్డాడా, విరోధుల కెంతబాధ? ఆయుణచరాని ధర్మనిష్టాపరత్వమే ఆతనిశక్తి.

## నిర్మాణశక్తి

ఆతని నిర్మాణశక్తి ఆశ్చర్యము కల్గించును. తనపుస్తకాలను, యితర విప్లవధోరణి పాత్రాలను ప్రకటించుటకై వొక గ్రంధమాలను స్థాపించాలనుకుంటూ వుండెను. నిడుబ్రోలులో రైతాంగవిద్యాలయ ఛాయల క్రింద స్థాపింపబడి, నెమ్మదిగా కదలుతుండిన రైతాంగ గ్రంధమాలనే తీసుకోరాదా" యని సలహాయిచ్చితి. వెన్వెంటనే, రైతాంగ గ్రంధమాలనే గుడివాడకు 23-12-38 తీసుకొనివెళ్లినాడు. వెంటవెంటనే మూడుగ్రంథాలను ప్రకటించినాడు. సంవత్సరానికి నాల్గో ఆరో గ్రంధాల ప్రకటిస్తానని పల్కినాడు. ఆతనికి డబ్బు దొరకదా? పుస్తకాలు పుట్టవా? బ్రతికేవుంటే యీనాటికి "అంబులపొది" "జ్యోతిర్మయినక్షత్రాలు" "త్రిపురీసమస్య" ప్రకటింపబడెడివే! ఆకార్యదీక్ష, చురుకుతనము మనయువకులకందరికి ఆదర్శప్రాయం.

## నిరుత్సాహపరచడు

"రైతులకిక దిక్కేది" అనే తత్వము ఆతనిచెంతకు చేరనేలేదు. మా "ధాటికి యెదురేది" అనే ధోరణే ఆ విజయభానునిది. "వచ్చె, వచ్చె" కాచుకోమంటూ వచ్చేవాడు! "పో, పో, పారిపో" అని దొంగల మందలించేవాడు! తిరిగి తనవారిజేరి, "రాండి, రారండి, మన విజయలక్ష్మికి పట్టాభిషేకం చేస్తామ"నేవాడు. అంతట జయభేరి మ్రోగించేవాడు! ఎవ్వరైనా రైతువుద్యమాన్ని నీరసంగా మాట్లాడెనా "వోహో, వినపడలేదా మా విజయఘోషలు, కనపడలేదా మా యెర్రజెండా" అంటూ హృదయవీధిని పల్కుల చిత్రించేవాడు!! మన ప్రపంచాన విసరేవాడు.

ఆతనియందు ప్రతిబింబించిన రైతుతత్వము, ఎదురెరుంగని పల్లవ, కాకతీయ, విజయనగర, రెడ్డి, పాండ్య, చోళ, చేర రాజ్యాల నిర్మాతల నవ...హ్వానపు వీరశక్తి! ఆతని ప్రతిరేణువు, ప్రతిపల్కులో, "రంకె" వేసే ఆంబోతెద్దుబలం కలదు. ఆయన్నుండి మేము నేర్చుకొంటిమా, మానుండి ...తడు గమనించెనా? అతని వుత్సాహం, వుద్రేకాలను మేము గ్రహించుకొం...? మాశక్తిపరంపరల నాతడు ప్రతిబింబించెనా? నే తేల్చలేను?

...ట్టిపల్లి గీతాలవల్ల మేమెంతో శక్తినేగాదు, వుషారను పొంది ...పెగా నూతనభావాలను, ధోరణిని, నడకను, మరి, వురవడిని వృద్ధ... గ్లితిమి. కనుకనే శెట్టిపల్లి యికలేడంటే యెంతోబాధ మాకు, మన ...ు కూలీలకు కల్గుమన్నది.

## అడ్డెరుగని ముందు నడక

అవ్వి పాటలా? పాటలేనా? పొలికేకలేకాదు, జయభేరిమ్రోతలు. వోమారు యీదేశానికంతా మేముకాదా కర్తలం అనుకునేవాడు! కాదనేవారుంటే, రారండి అంటూ దూకేవాడు! మరోమారు రైతుసంఘాలను త్రొక్కివేయా లనుకొనేవారిని తల్చుకొనేవాడు! వారిపై విరగబడి వచ్చేవాడు! అదిగో, జమీందారులు కుట్రచేస్తున్నారు అని వినేవాడు, "ఆ, ఆ, రావడమే, మా రైతులమీదనే" అనుకొంటూ, త్వరపడి తత్తర పాటుతో, ఎగిరి, ఎగిరి, దుముకుతూ, వస్తుండేవాడు.

కనుకనే ఆంధ్ర కాంగ్రెసు పెద్దల నిరంకుశచర్యలకు వోర్చుకోలేక పోయాడు. వారివయస్సు, నెరసిన వెంట్రుకలు, అధికారౌన్నత్యాన్ని జూచి వెరవలేదు. "తెలుసుకోదగిన పట్టాభి" యనే రాచకీయచర్చను తనచిరు పొత్తముద్వారా ధైర్యంతో, మరి పట్టుదలతో విసరివేశాడు! ఆ దెబ్బ యింకా గింగురుమంటున్నది ఆంధ్రదేశాన!!

## నూ త్న భా వా లు

క్రొత్తది యేదైనవస్తే దాన్నిపట్టిచూడాలసిందే. ఆ 1933 వరకు జాతీయవిప్లవవీరులకే వందనాలు. కనుకనే విసుగెరుగని ఆకవికుమారునికలంతో

"జ్యోతిర్మయి" అనేపదాల పాత్రాన్ని ప్రకటించాడు. "సూర్యనమస్కారాల" నేర్పుచుండిరా 1934 లో వినయాశ్రమమందు. అది నేర్చుతానన్నాడు. సోషలిస్టు వుద్యమమొచ్చింది. అందుతాముందన్నాడు. త్రిపురిలో సోషలిస్టుల వక్రనడతలకు విసిగి, వూరుకోనక విరగబడి విమర్శించాడు. అది చాలలేదు. ఫార్వర్డు బ్లాకు వస్తున్నాదని విన్నాడు. రావలసిందేనన్నాడు. రప్పించాడుకూడా చురుకైన, బలమైన, ధీమాగల నాల్గువ్యాసాలతో, వంద చర్చలతో. అందరికంటెమించి, మరి విజృంభించి, "ఫార్వర్డు బ్లాకు"ను ప్రజలహృదయాన ప్రతిష్టాపన చేశాడు.

## ప్ర పం చా ను భ వం

కమ్మని తిండే కాదు, ముచ్చటైన గుడ్డలేకాదు. ఆనందమును కల్గించు చెప్పుల జోడు, కండ్ల జోడు, క్రాపింగులనుండి, తాంబూలం వరకు అన్ని అనుభవాలను కోరేవాడు. అంతకు మించిన అనుభవం ప్రజలందరికి కావాలననే ఆతురత పడేవాడు. తనకు డబ్బు లేదనే దిగులులేదు. మరొకరికి లొంగి చేయి జాచేవాడు కాదు. క్రమంగా ఆయంద చందాలు తనకొక్కనికే యేల అనే భావాని కొచ్చినాడు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్నాడు. యింతలో__

నేర్చుకొనే దానికి, తనకు నచ్చినవాళ్లవద్ద, తయారుగా వుండేవాడు ! అది నా యదృష్టం. నేచెప్పితే చాలావరకు వినేవాడు ? "పాటలు వ్రాయి, పోట్లాటలుమాను, భావాల సృజించు, భోగాలమాను, నూతన తేజాన్ని ప్రసాదించు, వట్టి వట్టి తిరుగుళ్ల మానుము" అని యెన్నో మారులు నే చెప్పుతుంటె, సరేననేవాడు ? నావద్ద కొచ్చినప్పుడల్లా, వొక్కొక్క క్రొత్త భావాన్నో, పాటనో, పల్కునో చూపెట్టేవాడు ? నే నెరుంగుదు, నిమిష నిమిషానికి విపరీతంగా పెరిగి పోతున్నాడని, భావాల్లో, పోకడలలో, మరి నడకలలో ?

పొలికేక వేసే రైతుకూలి పల్కు, నిండు పంటలజూచి ఆనందించి ధాన్యరాసులపైవీచు రైతుకూలీల ఆత్మవిశ్వాసము, రకరకాలుపంటల వివిధ

వత్సరాలలో, ఎండవానలకు లెక్క జేయక, అతివృష్టి అనావృష్టులకు వంగిపోక, కరవు కాటకాలకు క్రిందబడక, యుగాలపర్యంతం రాజులకు, రా రాజులకు తిండినిచ్చే రైతులతేజం ఆతనియందు ప్రతిబింబిస్తూ వుండేవి? ఆ వ్యక్తియొక్క సర్వాణువుల నిజశక్తియంతా రైతాంగపురాణువను, కూలీల కామితార్థాలను సార్థకపరచుటయందే నిమగ్నమైయుండెడివి !

## గీతాల మహత్తర శక్తి

కనుకనే రోజురోజునకు పెరుగుచూ, కాంగ్రెస్ తథోరణుల నవలంభించుతూ, బహుదూకుడుగా పరుగులెత్తుచుండే యీ భారతీయ రైతు కార్మికోద్యమాలకు, పోటీపడుచుండే నూతనంపు-తలంపులనేగాక, కార్య ధోరణిని, నడకలనేగాక, రాజ్యాధికారకాంక్షను కల్గించగల్గు మహత్తర శక్తిసంపద శెట్టిపల్లిగీతాలలో ప్రతిబింబిస్తున్నాయి.

"ఆరరాదీ అగ్నిజ్వాలలు, అణగరాదీ విజయఘోషలు రైతుకార్మిక రాజ్యస్థాపనచేసి భాసిలునంతదాక" అంటూ అందరిని "రైతు, కార్మిక రాజ్యస్థాపన చేయగావలె, లెండు లెండోయి" అని మేల్కొల్పుచూ మన శెట్టిపల్లి హృదయం యీ స్వరాజ్య సంపాదనా ప్రయత్నమునుమించి ఆ పిమ్మట రైతుకూలీలను స్వధర్మనిరతులుగా చేస్తూనేయుండును.

ఆయాకాలానికి అవసరమయ్యే భావాలను ప్రకటించి, హృదయాలనుత్సాహపరచు, 'రుడ్యార్డు కిప్లింగు' లాంటి కవులే, నోబులు బహుమతుల పొందుచున్నారు. అప్పటప్పటి ప్రజలకు నూతనశక్తుల కల్గిస్తూవుండే 'బర్నార్డుషా' లాంటివారికే ఆ బహుమతులు వస్తున్నవి. కాని, రానున్న కాలాలవారికి కూడా వుత్సాహమేకాక, ప్రోత్సాహము, నూతనభావాలేకాక, క్రొత్త కార్యపటిమకల్గించుశక్తి, మరి అదృష్టము యే "షెల్లీ"కోకల్గింది యింగ్లండులో. నవ్యభారతావనిలో మన "శెట్టిపల్లి"కి అందినది.

## ఆధునిక కవి గాయకులకు మార్గదర్శి

యీనాటి కవులెట్టి ధోరణిలో వ్రాయాలో, గాయకులు పాడాలో, భజన పరులు తాళాలు వేయాలో, ప్రచారకులు వారందరి శక్త్య

త్సాహముల నుపయోగించుకోవాలో "తునికి పాడు" రైతాంగ విద్యాలయ మందు 1939 మే 25 వ తేదీన తానే తెల్పినాడు ! !

మన సారస్వతానికొక వన్నె దెచ్చినాడు మన శెట్టిపల్లి. మనపదాల కొక శక్తి కల్గించాడు. మన నడకలకొక నూతన గమకం పొందు పరచాడు! ఎన్నాళ్లు బ్రతికెను యింతకు ? యిరువది నాల్గేండ్లే గదా ! ఆ 'షెల్లీ' కూడ యిటులనే !

యింకెన్నిపాటలు, పద్యాల అల్లేవాడో ? మరెన్ని క్రొత్తకాంతుల విరజిమ్మేవాడో ?

యీ జూలైలో "గోభూమి"కి వచ్చినప్పుడు రెండు నూతన పాటల పాడినాడు. వాటిని వెంటనే "వాహిని" పత్రికకు పంపమంటిని. సరేననెను. యింతలో ఆ జ్వరమున కాహుతుడైనాడు. యీనాడాపాట లికయెటుల దొరుకుతాయి ?

"ఆరెండు పాటల మొదటి మాటలు"

"ఎగిరింది, ఎగిరింది అది వొక్క జెండా,
సరిక్రొత్త జెండా, మన యెర్ర జెండా"

"వురిమింది, వురిమింది వురుము, వురిమింది"

రైతుకూలీల గర్జనలు వురుముల బైలు దేరినవట, మెరపులతో లేచినవట. జమీందారులనడంచుటకై, షాహుకారులతో తొలగద్రోయుటకై మాత్రమే కాదట !! అసలిన్నాళ్ల నుండి తమ్మణచివేస్తున్న తమయొక్క బానిసత్వతత్వము, పతితపల్కులు, పిరికతనముల విసరివేయుడానికై రైతుల సత్తా "వురిమింద"ట.

## పా ట ల ప స ం దు

ఆయన పాటలన్నీ అంతే ! వోమారువింటె అవ్వి మనస్సున నిల్చి పోవాలసిందే. వాటిభావము హృదయానికి వుత్సాహము కల్గించవలసిందే ! జీర్ణించిపోవుచున్న రైతుకూలీలకు నవజీవనామృతమును ప్రసాదిస్తవి ఆయన పదాలన్నీ !!

తన పాటలపాడుటకు సరిపోయే రైతాంగ గాయకుడు, తనలాంటి సానబెట్టినిరత్నం, తనతోడి బీదరైతుబిడ్డ, అట్లూరి అప్పారావెదొరికాడు.

"వచ్చింది, వచ్చిందిగా," అంటూ పరుగు పరుగున వస్తూవుండే వాడు అప్పారావు. "ఏమిటేమిటయ్యా" అంటె "శెట్టిపల్లి మరో చిచ్చులపిడుగువేశాడు. పట్టుకొచ్చానవేవాడు. పాడమంటె, అట్టెలేచి, ఆ జిర్రతలతో, తళతళమనే కన్నులలో శెట్టిపల్లి తత్వాన్ని రైతుల నిజశక్తిని, కూలీల కాటకాన్ని తళ్కుతళ్కుగా వెలిగిస్తూ పాడుచుంటాడు యీ రయితాంగ గాయకుడు. యిక యెవ్వరీ గాయకునకు విజయింపు పల్కుల ప్రసాదించేది అనిపిస్తుంది.

ఐతే విచారపడుటతప్పు ! విచారమనేదే శెట్టిపల్లికి తెలియదుగా ! నిస్సారులైన తన రైతుల, నిద్రాణులైన తన కూలీల నెరుగడా ? ఐనా వారియందంతర్గర్భితమైన బడబాలనాన్ని ప్రజ్వలింపజేయాలనే ఆతడి ఆశయము !!

ఆతడి స్థానాన్ని నింపగలవారున్నారు. తమ భావాలకు, తమ ధోరణికి ఆతడి ధోరణినేకాక, ఆతడి ఆత్మవిశ్వాసము, ధర్మచింతను చేర్చుకొంటే, రైతువుద్యమముపై ఆతనికిగల విశ్వాసము, అపార ఆదరణ, కూలీలంటె ఆతనికున్న అభిమానమును పెంపొందించుకొంటే, త్వరలోనే మన వెంకట్రామానాయుడు, చదలవాడ, గరిమెళ్ల, తుమ్మల, గొట్టిపాటి, రామకృష్ణ, తిమ్మారెడ్డి, వుదయగిరి, పురిజాల, తుమ్మల, శీతారామమూర్తి జాషువాప్రభృతుల అపారనవ్యజీవిత భావకాంతులు, మనదేశానికి రైతుకార్మిక రాజ్యస్థాపనకు పునాదులనేగాక, పద్మాలను, శిఖరాలనేగాక, శంఖారావముల ప్రసాదించగలరని నా విశ్వాసము.

## విజ్ఞానవికాసం

ఆతడికి యింగ్లీషు రాదు. ఐనా యీకాలపు విజ్ఞానాన్ని అతిచురుకుగా గ్రహించుకొన్నాడు. పరీక్షలలో నలిగిపోలేదు, పాఠశాలలలో క్రుంగిపోలేదు. ఎన్నో పుస్తకాల చదివినాడు. వాటి సారమంతా తన సజీవమైన హృదయ ఫలకాన్న నిల్పుకొన్నాడు. అన్నిటికిమించి, రైతులు, కూలీలు పల్లెటూళ్ల జానపదాలు, తత్వాలను గ్రోలినాడు, గ్రహించుకున్నాడు.

యీనాడు "శెట్టిపల్లి" ని తలుచుకొంటె యింతటి మహోన్నత శక్తి, మహత్తర భావాలు మన భారతీయ రైతాంగ మందు మరెందరిలో కలవో యను ఆశ కల్గుచున్నది. అట్టి మణులుగల్గిన యీ రైతాంగపు గనుల నింతవరకు మనదేశీయులు త్రవ్వకపోబట్టె మనదేశానికీగతి కల్గియుండాలి!

రైతు సేవకుల ధర్మమొకటి కలదు. రైతుకూలీలమధ్య ఎచ్చటెచ్చటో ఎందరెందరో "శెట్టిపల్లి" లాంటివాళ్లు కలరు. వారిని కనిపెట్టాలి, వుత్సాహపరచాలి, పైకి తీసుకురావాలి, వారినుండి క్రొత్తశక్తుల ప్రజలకు ప్రసాదించాలి. అప్పుడే "శెట్టిపల్లి" ధోరణి ధన్యపరుపబడును.

రైతులందున్న శక్తి, కూలీలందున్న కూరిమి. యిద్దరియందున్న వోర్పు, శ్రామికబలం, సూర్యారాధన, వాయుభక్షణ, అగ్నికాంతులవిగో మెరుపులాగ శెట్టిపల్లిద్వారా మెరసినవి. యిక అలసింపరాదు. మరి మరువరాదు. యీ యపారశక్తులను, అమేయభావాలను, నిరుపమాన నిర్మాణధోరణిని, పెరుగుచుండే పాలనాశక్తిని కన్గొని, తేర్చి, కూర్చి, పెంచి, మరి, సర్వజనులపోషణకై వుపయోగించుటయే; రైతుకూలీల ఆర్థికదాస్యాన్ని, రాచకీయ దైన్యాన్ని, సాంఘికబోధలను పారద్రోలుటయే రైతుకూలీ సంఘ సేవకుల ధర్మం.

## ఉచిత స్మారక చిహ్నం

శెట్టిపల్లి కెద్ది తగిన స్మారకచిహ్నము? రైతుకార్మిక రాజ్యస్థాపనయే! ఏనాడు రైతుకూలీల రాజ్యస్థాపనమౌంది, ఆబాలగోపాలము ఆనంద ఘోషల నోలలాడుచు, విజయదుందుభుల విరజిమ్ముతారో, ఆనాడే మన శెట్టిపల్లియందావిర్భవించి, వెల్గొందిన మనప్రజల నిజశక్తి ప్రజలకు ఆరట తీరు, పూర్తిప్రకటన కల్గును.

ఆంధ్ర రైతాంగ విద్యాలయము. రామా-నీడు భవనాలు నిడుబ్రోలు. } రంగా. 7—11—39

# రైతుకూలీల మాటలు, పాటలు.

శెట్టిపల్లి అంబుల పందిళ్లు*

యీనాడు కష్టజీవుల కథలు కావాలి! చెమ్మటబిందుల మాణిక్యంపు పద్ధతులు ప్రకటించాలి! పొలములో భూమిపై పోరాడువారు, చేలల్లో చెరలాడువారు, బీళ్లల్లో గోమాతలకు తోడగువారు, డొంకలలో పచ్చి చొప్పమోతల సంగీతాన్ని విరజిమ్మువారు, నదులవెంట, కాల్వలప్రక్క, రాళ్లమధ్య, అడవులచెంత పశుపక్ష్యాదుల కూరటకల్గించువారు, తోడిమానవులకు జీవితాశలను విజృంభింపజేయువారు ఆ కోటానకోట్లకొలది సాధారణ ప్రజలు, కష్టించు కార్మిక కర్షకులు, అలసట నెరుగని బక్క జీవులు సున్నితమగు జీవితానుభవ మెరుగని సుతిమెత్తని హృదయాలవారు - యీనాటి భావకవులకు, నూతన రచయితలకు, మననాయకులకు, ప్రజాపాలకులకు, మహా ప్రపంచగంధర్వులకు అర్హమగు నాయికా నాయకులు.

యీ సత్యాన్ని మన ఆంధ్రదేశపు కవులు, గాయకులు, చాలనాళ్ల నుండి గ్రహించిరి. "గురజాడ" నుండి "బసవరాజు" వరకు, "సాహితీ సమితి" నుండి "విస్వసాహిత్యమాల" వరకు, "రామిరెడ్డి" నుండి

* రంగాగారు "ఆకలిమంటలు" అనే పుస్తకానికి 1938 జూలైలో వ్రాసిన పీఠికలోని భాగాలు

" జాషువా " వరకు, " శెట్టిపల్లి " నుండి " గొట్టిపాటి " వరకు, ' పున్నవ ' నుండి " గరిమెళ్ల " వరకు, యీ నవ్య భారతభావాలను వినూత్న కాంతుల విరజిమ్మ నూతన సాహిత్యసృష్టిలో ప్రకటించుచున్నారు. ఇందును భారత దేశమున ఆంధ్రుల కవి, గాయకులదే ప్రథమ తాంబూలము.

యీ పంథాకు వడి, వేగము గల్పించుటకే " రైతు గ్రంధమాల " వారి ప్రథమపుష్పము " హరిజననాయకుడు " యీనాటికి ఆంధ్రులకు ఆదర్శ మగు వ్యక్తి, మనుష్యులలో, సాహిత్య ప్రపంచములో ! రెండవ పుష్పము ఆంధ్ర గ్రామసీమలకు నూతనజీవకళ ప్రసాదించుచున్న " రైతు భజనావళి ". దాని " సౌరభముల " నానందించి యింకను ఆంధ్రులు తనివిజెందుట లేదు.

యీ నూతనసాహిత్య పోకడలు విషయ విమర్శ యందే యగుచో, అనుభవ ప్రకటనమందేయైన, ప్రకటింపబడు సాధారణ మానవుల యితి వృత్తముద్వారానే యగుచో, జనబాహుళ్యాని కందుబాటులో వుండ నేరవుగదా !

కనుకనే, ' మాలపల్లిలో ' విరజిమ్మబడ్డ ప్రజల వాడుకభాష, యీ నాడు " రైతాంగ " సాహిత్యమందు వెల్లువలై వన్నెకెక్కుచున్నది. ఎవ్వరి వీమాటలు, పదాలు, పద్యాలు ? ఎందున్నవి ? ఎచ్చట చెలరేగుతున్నవి ! ఎవ్వ రికి ? వొక్కటే సమాధానము. గ్రామసీమపల్కులు, గ్రామీణుల పదాలు, మంచెపైని కూకలు, పశువులప్రక్క వూగిసలూగు పదాలు, నాగేలువెంట పారాడు సంపదలనీను నవనీతపు భావబీజాలు.

యీ పంటకై మహాత్ముడు, కాకాకలేల్కరు ఆరట పడుచున్నారు. ఆంధ్రకార్మిక సేవకులీనాడు " రైతాంగ " మురళీలద్వారా వూది వూపివేస్తున్నారు.

యీ మృదుమధురగానం మనందరికి స్వధర్మమును మరపించుటకు గాదు, స్వధర్మనిరతి పురిగొల్పుటకే ! బీదసాదల బాధల చిత్రించి, మన మనోప్రపంచరీతులందతివేగంగా విప్లవమును కల్గించి, చిన్న చిన్న కోర్కెలతో తల్లడిల్లు మనల స్వార్థంపు చింతలతో చీకిపోవు మనల-సంకు

చిత భావాలకు దాసులైన మనల-మనందరి కాధారభూతులైన రైతు కార్మికుల రక్షించుటకై ప్రోత్సహించుటకు !

యీ యపారహృదయ పరివర్తనము నతివేగంగా కల్గించుచున్న "భావబాలుడే" ఆంధ్రుల అపరాని ఆనంద జ్యోతుల తన హృదయకాంతు లందు ఆరాధించు మన "శెట్టిపల్లి" తన యీ చిన్న "అంబులపొది" ని మనలాంటి "ఏకలవ్య" ల హస్తములం దిడుచున్నాడు.

తానొక రైతుబిడ్డ; నవనవలాడే వయస్కుడు; సుఖప్రియుడు; ఆనందపిపాసి; ఐననేమి ! చుట్టునున్న బాధాప్రపంచమును మరచునా ? కష్టాల కిరవగు కాపుల జీవితాన్ని చూడడా ? ఆర్తత్రాణకై ఆరాట పడడా ? ఆ "గీతాగోవిందు" ని జీవిత వ్యాసంగాలు ఆతని ఆపగలవా, మరి దాచగలవా ? మనందరికి యీ "అస్త్రాల ఆభరణ" మందలి నవ రత్నాలు కన్పించుతూనే వున్నాయి ! కాని మనము వాటిని గుర్తించుట లేదు ! గుర్తించినను వాటినొకచోట చేర్చుటలేదు ! చేర్చిననూ మనహస్తము లందా కలయిక కలుగుటలేదు. మనకళ్లకా భావరత్నముల "ఖచిత" పరచుట కనువగు దృశ్యము ప్రత్యక్షమగుటలేదు. ఇట్టి అదృష్టము, సౌకర్యము మన "శెట్టిపల్లి" కి లభ్యమైనందులకు ప్రజాసామాన్య సేవకులమగు మనము మనలనే అభినందించు కొందాము.

యీ అభినవ అర్జున అంబుల పందిరివల్ల అనాథలగు వారికి అంతనీడ, యింత యోదార్పు కల్గుగాక ! దీనిచే ప్రజలపీడించు దుష్టమానవులకు పరాజయము కలుగుగాక !

# ప్రతిభావంతుడైన కవి

ఇంగ్లీషులో శెట్టిపల్లి రచనలను చదవటం అంటే మరొకక్రొత్త ప్రపంచంలోకి అకస్మాత్తుగా పోవటంవంటిది. అచట విశ్వాసం యదార్థమైనది. విప్లవశక్తియొక్క బలమే విద్రోహాలపై విజయాన్ని పొందింది. అలాంటి ప్రంచాన్ని పాశ్చాత్యులూహింపనైనా లేరు ! ఇచట విప్లవకవులు తలకాయలు బద్దలుచేసుకొని అలాంటి విశ్వాసంకొరకు వెతకాలి. కన్పించినా ఆ భావాలు మాటల్లోకివచ్చి కాగితంమీదపడితే సహజంగా వచ్చినట్లు కనపడవు ; కావాలని, పట్టుపడి వచ్చినట్లు ఉంటవి.

ఎవరినైనా హేళనచేస్తూ, ఎద్దేవగా వ్రాయటం ప్రారంభించితే కలం అతిచురుకుగా, చకచకా నడుస్తుంది. చాలాస్వేచ్ఛగా వెళ్లిపోతుంది. ఎవరన్నా ప్రపంచదారిద్ర్యాన్నిచూచి అమితంగా బాధపడి ఆభావాలకు మాటలకు పొందిక కుదిర్చినా ఇతరులను ఓదార్చ యత్నించినట్లు, తినహృదయ పరితాపాన్ని వెళ్లబోసుకున్నట్లూ ఉంటుందేగాని, చచ్చిపడి ఉన్న పేదలకు నూతనశక్తినిగాని, ఉత్సాహాన్నిగాని ఇవ్వలేవు.

శెట్టిపల్లి అలాంటి మానసికస్థితిని యెరుగడు. అతనికి ప్రజలదైన్యం, రైతులదారిద్ర్యం చూస్తే జాలికిబదులు, భయంకలుగుతుంది అభయం శత్రువులపై మరల్చుతాడు. అదొక విషవాయువుతోకూడిన మేఘంలా కన్పించుతుందతనికి. అది ధనికవర్గాలపై వర్షించి ధనికతత్వాన్ని నిర్మూలనం చేస్తుంది.

# రైతుల్లో రైతు

అతనిపాటల పొందిక, అందచందాల గూర్చి నేనాటే చెప్పలేను; ఎంచేతనంటే - ఇంగ్లీషులోకి తర్జుమా అయినతరువాతనే వాటిని చదువ గలిగాను. కాని భాష ఏదైనా, ఎలా తర్జుమాఐనా, భావాలు ఎక్కడికి పోతాయ్. అతన్నిగూర్చి ఏమీ తెలుసుకోకుండానే అతని పాటలను చదివితే అతడు సామాన్యప్రజల్లోనుంచి వచ్చాడని తెలుస్తుంది. ఆవిషయమై ఎలాంటి అనుమానమూ ఉంటానికి ఆస్కారంలేదు.

అతడు ధనికుల ఇంట పుట్టలేదు. జాలి, దయలతో ఆ పైమెట్టునుండి క్రిందకు, ప్రజలమధ్యకు దిగిరాలేదు. రైతుల్లో రైతు అతను.

తమభాగానికి రావాల్సిన ధాన్యంకొరకు దీనత్వంతోకూడిన ఆ కళ్లతో తమ ఆసామివైపు చూస్తూఉన్న పశుగణం: భూదేవిని భగ్నం చేయటానికి నాగేటిసాళ్లనుండి చిమటల్లా తయారై వస్తున్న ధనికవర్గం... మొదలైనవాటి స్వరూపాన్ని ఎవరు ఊహింపగలరు ? వీటన్నిటి అనుభవాలను పొందటమేగాక వాటిమధ్యనుండి పుట్టుకొచ్చినవాడే ఊహించుకో గలడు : ఉన్నదున్నట్లు చిత్రించగలడు.

వీటన్నిటినీమించింది అతడు కార్మిక కర్షకులపట్ల ప్రకటించే వైఖరి, దూరాన్నుండి పడ్డునకూర్చొని ఈ కార్మికకర్షకులవైపు చూచేవాడుకాదు. అతని పలుకులు, పిలుపులు కార్మిక కర్షకులమధ్యనుండే వస్తూఉండేది.

ఇతరులు ఈబాధితులనుచూచి పెద్దనిట్టూర్పులనో, దీర్ఘనిశ్వాసాలనో విడుస్తూ ఉంటారు. కాని శెట్టిపల్లో ! అతనికి కన్నీళ్లు కార్చటానికిగాని. జాలిపడటానికిగాని వ్యవధిలేదు. అలా కాలం వృధాచేయలేదు. చూచే చూడగానే తీవ్రమైనకోపం వచ్చేది. కోపం తిరుగుబాటును ప్రోత్సహించేది. ఆతిరుగుబాటు విజయాన్ని చేకూర్చేది.

ఓదార్చటానికిగాని, తన జాలిని తెల్పటానికిగాని ఒకపద్యంగాని, ఒకపాటగాని వ్రాయలేదు. విజయాన్ని పొందగలం అనే ధైర్యోత్సాహాలతోనే ప్రతిపదమూ వ్రాసాడు. ప్రతి పాటపాడాడు.

## రైతు ఉద్యమ ప్రతిధ్వని

ఇదంతా శెట్టిపల్లికంటే గొప్పదైనవిషయాన్నిగూర్చి చెప్పుతుంది. అలాంటి భావాలు, ఉత్సాహం, ఉద్రేకం ఏ ఒక్కవ్యక్తి చైతన్యంనుండీ రావు. తనలాంటి కామ్రేడ్స్ మధ్యఉంటేగాని అలాంటి పాటలు పాడలేడు. అతడు వాళ్లతో ముచ్చటించిన విధానంచూస్తే ఇదంతా చక్కగా కన్పడుతుంది. వాళ్ల బాధల గురించి వాళ్లకు చక్కగా చెప్పాడు. వాటిని తలచుకొని విలపించటానికి మాత్రం అవకాశం ఇవ్వలేదు. వెంటనే కార్యాచరణకు, లాక్కుపోయేవాడు. వారికి ఆశాజ్యోతిని చూపేవాడు. కష్టాలను మరపించే మురళీనినాదాలకోసరం వారంతా తనవద్దకు రాలేదని అతనికి తెల్సు. వాళ్లమీద విసుక్కునేవాడుగాదు. కోపంవచ్చేదిగాదు. వాళ్లనుచూస్తే అతనికి తన కామ్రేడ్సులో చాలా గట్టినమ్మకంఉంది. అతని విజయగానంతో వారికి నూతనోత్సాహాన్ని, క్రొత్తశక్తిని ఇస్తాడు. ఒకపెద్ద ఉద్యమంలో ఉన్న మని షిలాగామాట్లాడేవాడు. ఆ ఉద్యమం ఎలాంటిది ? బ్రహ్మాండమైనది. ఎంతో లోతుకు పాతుకుపోయింది. ప్రతిమానవుని హృదయాన్ని ఆకర్షించి అతన్లోవెర్రి అనేదిలేకుండా చేస్తూఉంటుంది.

## భూదేవి ఒక్కటే యదార్థమైనది

అలాంటి రైతు ఉద్యమ ప్రభావం, దానికి సంబంధించిన పాటలు, పదాలు, ఇంగ్లీషువారి చెవులకు ఆటే అంత ఇంపుగా ఉండవు.

విప్లవకారుడు ఎప్పుడుకూడా సరియైన మనుష్యులకోసరం చీకిపోయిన పాకాల్లో, కూలిపోయిన ఇండ్లమధ్య వెతకాలి.

భూమి ఒక్కటే యదార్థమైన వస్తువనే శెట్టిపల్లి మనకు జ్ఞాపకం చేస్తున్నాడు. రైతుల కూలీల చేతుల్లోనే మానవకోటియొక్క చావుబ్రతుకులున్నవని నిరూపించినాడు.

అతడు ఇంగ్లండ్‌ను గురించి ఆలోచించి ఉంటే భారతీయ రైతులు బ్రిటిష్ సామ్రాజ్యతత్వానుండి ఎంత తేలికగా వదలించుకోకలిగేవారో గ్రహించివుండేవాడు. బహుశః ఇంగ్లండ్‌ను గురించి ఆలోచించటం అంత తగిన పని అని అతడు తలంచివుండ లేదు.

అతని హృదయంలోని భావాలు సగమైనా బయటకు రావటానికితగినంత వ్యవధి లేక పూర్వమే 24 వ ఏట కాలం చేసాడు. కాని అతని పాటలు ఆంధ్రదేశంలోని ప్రతిరైతు హృదయంలోనూ నాటుకు పోయినవి. కార్మిక, కర్షక సమావేశాల్లోనేమి, రైతురక్షణ యాత్రల్లో నేమి, అతని పాటలే వినబడుతూ ఉంటవి. అతనిశక్తి అతని ప్రజల్లో చిరస్థాయిగా నిలచి, వారికి నూతన శక్తిని ప్రసాదించు గాక!

లండన్,
1-11-39

ఎ. జి. స్టాక్.



# ఆ శీ ర్వా ద ము

జ్యోతిర్మయి యను ఖండకావ్యసంపుటము శ్రీ శెట్టిపల్లి వేంకట రత్నం (చౌదరీ) గారిచే రచియింపబడి గొప్ప జాతీయగీతాగానమండలి భావ స్ఫురణరూపకమైన మహనీయవ్యక్తిత్వమున కాస్పదమగు పెద్దపెద్ద రత్నా లిందుజేర్చినట్లగపడుచున్నది. ఇందలి గీతపద్యములన్నియు రససమన్విత ములై సొంపు సంపాదించుచున్నవి.

నూతనభావములతో నూతనతేజముతో, శరవేగమున జాతీయ సౌధ సోపానము నెక్కిపోవుచున్న యువకులను గవులను జూడ మన యాంధ్ర మాత మిగుల హర్షార్ణవమున నోలలాడి తలతోంటందిన నమ్రభావమును మరచుననియే నా యుద్దేశము.

ఈ కవిగారు చాల బాల్యులు. మంచి కవితాధార, వాక్శుద్ధిప్రయోగ సైపుణ్యము గలుగుట పుణ్యావాసవిశేషమని దోచెడిని.

పిఠాపురము
1 _ 9 _ 33

ఉమర్ ఆలీషా.

# శెట్టిపల్లి ఇష్టాగోష్ఠి

కవికుమారుని కలమునకు విశ్రాంతిలేకపోయినను, ధనాభావముచే క్షామము దాండవమాడుచున్న యీదినములలో నార్ధికక్షామమును లెక్క జేయక పసిపాపయగు జ్యోతిర్మయ ఆంధ్రలోకము ముద్దుముచ్చటల నందుకొన శ్రీ ఉమర్ ఆలీషాకవి యాశీస్సులనంది తెలుగులోకము సన్నిధిగనులు తెరచినవి.

జ్యోతిర్మయి పసిపాప. ఆమెమాటలలో అలంకారము లేకపోవచ్చును. వస్తుసామగ్రిలేని కొరత గానుపించుచుండవచ్చును. భాషా సౌందర్యము కొరవడియుండవచ్చును. వ్యాకరణజ్ఞానపరిపూర్ణము కాకుండ జ్యోతిర్మయి జనకుడనగు నేనుగాని ఆమెగాని వీటినన్నిటి నంతగా లెక్క జేయలేదు. "మహాగ్రంథము లుద్భవించి వాఙ్మయదేవత నారాధించు యీ దినములలో నీచిన్న జ్యోతిర్మయి ఏపాటిది ? మాతృభూమి కీమెకూర్చు నున్నతస్థాన మెట్టిది" యని కవికుమారులు కలముపోటుల నొప్పింతురని కూడ మేము సంశయించలేదు. ఆమె యమేయగౌరవమును జన్మభూమికి ప్రసాదింపలేకపోయినను, మాతృదేవి సన్నిధిని చిన్నబిడ్డ తనలీలల ప్రదర్శించి మాతృమూర్తి గౌరవమును నెట్లుచూరగొనునో అంతగౌరవము తెలుగుతల్లి ముద్దుముచ్చటలు దలంచిన జాలునని మాజ్యోతిర్మయి యభిలాష.

జ్యోతిర్మయి పండితులలో గలకలము బుట్టింపదలచుకొనలేదు. పెద్దల ఢెందములలో ఆందోళనజేయ నవతరించలేదు. యువజనుల నెల్గెత్తి పిలువ

దలచుకొనలేదు. దేశోద్ధారకుల గ్రీగంట వీక్షింపదలచుకొనలేదు. పురుషుల నిరంకుశత కన్ని విధముల బలియైపోయిన వీరిని బాధించు టేలయని కాబోలు; వేడినిట్టూ ర్పులు మహిళాలోకము దెస జూచుటతో మానివేసినది. అమాయిక లును, స్వాతిక తేజశ్శాలినులునగు ఆంధ్ర బాలికలతో నాడుకొనుటకే, పాడు కొనుటకే యభిలషించినది.

తెలుగు బిడ్డలారా!

మా జ్యోతిర్మయితో గలసి ఆమె పాడెడి గేయములలో మీ సున్నితపు కంఠస్వరముల మేళవింపజేయుచు నారిణీవేషముల ధరించి పల్లెలకరగి ఆంధ్రులలో నూతనోత్సాహమును దివ్యభావనలను, నుజ్జీవింపజేసి స్వాతంత్ర్య వాతావరణమును సృష్టింపుడు.

( జ్యోతిర్మయినుంచి )

# కవులకు శెట్టిపల్లి సందేశం *

అధఃపతితమైన దేశాన్నీ, జాతినీ పైకిలేవనెత్తేదే విప్లవశక్తి.

ఆ విప్లవశక్తి ప్రజలలో ప్రజ్వరిల్లాలంటే ప్రజల మనస్సులను మార్చివేసే భావవిప్లవం కావాలి.

ఆ భావవిప్లవాన్ని కలుగజేసేది సాహిత్యం.

ఏదేశాన్ని ఐనా మాఢ్యంలోనూ, బానిసత్వంలోనూ వుంచగల శక్తిగాని దాన్ని వాటినుండి ఉద్ధరించగలశక్తిగాని సాహిత్యానికి వుంది.

ఈ సత్యాన్ని, గ్రహించే రాజులు, కవులను పండితులను ధనంతో తమవశం చేసుకొని, తమకు పనికివచ్చే బూర్జువాసాహిత్యాన్ని సృష్టింపచేశారు.

ఈనాడు మన సా త్యమంతా బూర్జువాఘనతను పొగడేదే?

## వైదిక యుగంలో

ఈ యుగంలో మనసాహిత్యం దేవుడిని, కర్మను, సృష్టించి వాటి ప్రాధాన్యతను పొగడడంలో వినియోగపడింది.

వేదాలను మనుష్యులు వ్రాసి దానికి "అపౌరుషేయ"మని పేరిడి దైవదత్తంగా ప్రజల మనములలో హత్తుకుపోయేటట్లు చేశారు.

* తునికిపాడు రైతాంగ విద్యాలయమునందు 1939 జూన్‌లో వెంకటరత్నంగారిచ్చిన ఉపన్యాస సారంశము.

ఈ కర్మతత్వం, దైవం ఈరెండు మనిషిలోని శక్తులను క్రుంగదీసి ధనవంతులకు దాసుడినిచేసింది.

"పాపం చేస్తేగాని సంపాదించలేని డబ్బును పూర్వపుణ్యార్జితమని ఉన్నతనామధేయాన్ని కూర్చారు; కాని సాహిత్యంలో నిజమైన మార్పు రాలేదు.

## క్రమానుగత పరిణామము

తరువాత హిందూ మహమ్మదీయ బౌద్ధమహాయుగాలు గడచి పోయాయి.

ఈ యుగాల్లో కూడా మన సాహిత్యం వైదికయుగంలోని మోస్తరుగానే నడచిపోయింది.

రాజులను దైవాంశసంభూతులనుగాచేసి వారి గుణవిశేషాలతోను వారి విరహతాపవర్ణనలతోను, వారి భోగవిలాస స్తోత్రములతోను సాహిత్యాన్నంతా నింపివేశారు మన కవులు, పండితులు.

బూర్జువా సాహిత్యం గర్జనలు మానవ సమాజంలోని సహజములైన స్వాతంత్ర్య శక్తులను క్రుంగచేశాయి.

ఒక రాజపుత్రుల కాలంలో మాత్రం చారిణీ గీతికలు, విస్తరిల్లాయి. వీరు ప్రాచీన కాలంయొక్క వీరత్వాన్ని పాటల ద్వారా పల్లెపల్లెలలోను కీర్తిస్తుండేవారు.

ఆ కాలం వీరత్వం, ధైర్యం మరల నాట్యమాడింది కాని, అది బూర్జువాధోరణిలోనే వుండడంచేత, ప్రజాసామాన్యంలోని శక్తిని రెచ్చగొట్టగల కవిత్వం గాక పోవడంచేత అనుకొన్నంతగా ఉపయోగపడలేదు.

## సాహిత్యంలో తిరుగుబాటు

సాహిత్యంలో తిరుగుబాటు ప్రారంభమైనది పోతనకాలంలో.

రాజులకు సాహిత్య కన్నియను వశపరచకూడదనే నినాదాన్ని లేవదీసినవాడు పోతన్న.

తోలుదొల్త "బాలరసాల సాలనవ పల్లవ కోమల కావ్యకన్నియన్ కూళలకిచ్చి అప్పడుకూడు భుజించుటకంటె" నాగలి పట్టుకొని చేను దున్నుకు బ్రతకడం మేలన్నారు.

కాని, ప్రజాసామాన్యం వైపుకు తన కలాన్ని పరువెత్తించలేదు.

ఏదేవుని అడ్డుపెట్టుకొని ధనికులు దేశాన్ని పీడించుకు తింటున్నారో ఆతనిపైననే (భాగవతం) కవిత్వం కురుపించాడు.

కృష్ణదేవరాయల కాలంలో కవిత్వం స్త్రీ సౌందర్యవర్ణనలో గడిచిపోయింది. ఈకాలంలోనే "ప్రాంచద్భూషణి" మొదలగు శృంగార పద్యాలు, సీ. మకరధ్వజుని అనే బూతుల పద్యాలు పుట్టాయి.

బూతుల వర్ణనలతో ప్రబంధ సాహిత్యం వెల్లివిరిసింది. శ్రీనాధుని "జొన్న కలి జొన్నయంబలి" అనే పద్యం జంపద జీవితాన్ని వర్ణించేదైనా ఆతనిధోరణి బూర్జువా ధోరణి అవడంవలన లాభం లేకపోయింది.

## జాతీయ యుగంలో

సిపాయీల కలహాలనంతరం, కవిత్వంలో మార్పు రాసాగింది మన దేశంలో.

రాజుల కవిత్వమైనా జాతీయ కవిత్వమిది. జలియన్ వాలాబాగు దురంతాల తరువాత 1920 అసహాయోద్యమంతో జాతీయతతో మన కవిత్వం చిందులు వేసింది. 1932 లో జరిగి విజృంభించింది.

గాంధీజీని దేవుణ్ణిగా సృష్టించి, భారత నాయకులను పాండవులుగా కల్పించి, ప్రజలను ఇంగ్లీషువారి బానిసత్వంనుండి తప్పించడానికి ప్రజలలో విప్లవాన్ని కలుగజేస్తూ, కవిత్వం నడిచింది.

ఈ కవిత్వం దేశాన్ని మేలుకొల్పింది. బూర్జువా కవిత్వపు వాసనలున్నా.

## కార్మిక, కర్షక యుగంలో

1934 తరువాత మనకవిత్వం కార్మిక, కర్షక యుగంలోనికి పరిణామం పొందింది. ఈపరిణామమునం నందడానికి కిసాన్ ఉద్యమ స్థాపకులగు ఆచార్య రంగాగారు మూలపురుషులు.

1933 లో రైతాంగ సాహిత్యసృష్టికై రైతాంగ గ్రంథమాలను రంగాగారు నిడుబ్రోలులో సృష్టించారు.

రైతాంగాన్ని రైతాంగ సాహిత్యంతో మేలుకొల్పడానికి సేవకుల కొరకై రైతాంగ విద్యాలయాన్ని స్థాపించారు.

ఆ విద్యాలయమునుండియే "రైతు జయ భేరి" ప్రథమతా మ్రోగించబడింది. కూలీ సాహిత్యం సృష్టింపబడింది.

ప్రథమమున "రణభేరి మ్రోగింది, ఓ రైతుకూలి?" అని ప్రారంభించి, "రైతు కార్మిక రాజ్యస్థాపన చేయగావలె లెండు లెండోయి" అని ఢంకా కొట్టుకుంటూ, మన సాహిత్యం వెల్లివిరియ సాగింది.

రైతాంగ మురళీలను మ్రోయించే రైతు భజనావళులు 65 వేలు ఈనాడు తెలుగు దేశంలో ప్రచారంలో వున్నాయి.

## రష్యా నాయకత్వం

ప్రపంచానికి బూర్జువా కవిత్వాన్ని నాశనంచేసి, సామ్యవాద సాహిత్య సందేశాన్ని ప్రథమాన రష్యా అందించింది.

ఈ సాహిత్యానికి జన్మదాత కారల్ మార్క్స్.

ఈనాడు ప్రపంచానికి ద్వితీయంగా భారతదేశం అందులో బానిస భారతవర్షం అందిస్తోంది. ఈ నిజమైన సాహిత్య సందేశం తెల్గుదేశంలోని రామానీడు విద్యాలయంనుండి ఆచార్య రంగాగారి సహాయ ప్రోత్సాహములతో భారతవర్ష సాహిత్యానికి అలంకారాన్ని కూరుస్తోంది.

## మన కర్తవ్యం

కావలసిన సాహిత్యవిప్లవ సందేశాన్ని అందించడంలో మనం ఇంచుమించు కృతార్థులమయ్యాము.

కాని, సాహిత్యానికి కవులకు ఆదరణలేదు. పుస్తకాలకు కొనుగోలు శక్తి కనుపించడంలేదు.

దీనికి ఒకటేకారణం. దేశక్షేమాన్ని కోరేప్రతివాడు ఏజంటు కావాలి. పుస్తకాలను కొనిపించాలి. ఆవిధంగా మన సాహిత్యాన్ని అందచేయాలి. ఇందుకు లజ్జించరాదు.

## కవుల కర్తవ్యం

ఆంధ్రదేశంలోని కవులకొకమాట. ఇంతవరకు అందించిన సాహిత్యం చాలదు. ఇంకా కావాలి. బొబ్బిలికథలలో, జంగంకథలలో బుర్రకథలలో, జానపదగీతాలలో రైతు కార్మిక సాహిత్యం వెల్లువలు వెల్లువలుగా పొందాలి.

భారతీయమనోవీథుల్ని ఆక్రమించుకొన్న నేటి బూర్జువాకవిత్వ ఛాయలను నాశనం చేయాలి.

ధైర్యం కోలుపోయి, అలసత్వంలోవున్న పీడితవర్గంలో నూత్నోత్సాహాన్ని రేకెత్తించాలి. ఆనాడే మనం నిజంగా కృతార్థులం అవుతాం.



# రైతు జూడకపోతే!

అగునా జీవాలు
సాగునా లోకాలు
రాజుగా మనమెంచి
రైతుజూడకపోతె
దేశాలు తలలెత్తునా
దాస్యపు
పాశాలు తావీడునా!

ఆవు లంబాయంచు
అరచు రైతులయిండ్ల
కళ్యాణ దేవత
కనుల జూడనినాడు
సౌభాగ్య మేతెంచునా ?
దేశపున్
సిరిసంపదల్ నిల్చునా ?

పిల్ల పైరులమీద
చల్ల తెమ్మరవీవ
గాంచి యానందించు
ఘనుని గాంచకపోతె

సృష్టినైజము గాంతువా
ప్రకృతిని
"సౌందర్యమిక నిల్చునా ?"

పగలు రాతిరిలేక
పాటుపడునా రైతు
కడగండ్లుల గాంచి
యాదరించకపోతే
రాజ్యమే యిలనిల్చునా
భూద్దేవి
భగ్నమైపోకుండునా ?

పొలములో రైతుండి
పొలికేక బెట్టగ
జయభేరి మ్రోతలై
జగతి నిండకపోతె
వీర రక్తముపారునా ?
ఎల్లెడల
ధీరత్వ మడుగంటదా ?

(1933) (శెట్టిపల్లి వెంకటరత్నం, గిరిరాజు రామారావు.)

# కర్షకా

నీవు హలమునుబట్టి
నేల దున్నకపోతే
రాజాధి రాజులకు
రాలదొకగింజైన
నిలువ నీడున్నదే ?
లేవోయి కర్షకా ! లేవోయి కర్షకా

రణరంగమునదుముక
రైతురైతని జెప్పి
రైతుబలమూతోడ
కీర్తి గొప్పల పొంది
యెక్కడనొ కూర్చొని
రైతు సంఘాలుండ
రాదు రాదంటారు సీ. రా.

పండినా పంటంత
శిస్తుకొరకమ్మేసి
పంటఖర్చుల ఋణము
రక్తమును పిండంగ,
ఘనదరిద్రము తోడ
కడుపుపగిలి పోతుండ। సీ. రా.

కత్తులూ బాణాలు
ఫిరంగి తోటాలు
లేవు లేవో యంటూ
జాలి పడబోకోయి;
నీ హలము కొడవలియె
నిజమైన బాణాలు
నిన్ను మార్కొనువార్కి. పీ. రా.

అఖిలభారత రైతు
సంఘమే యుండగా
తమ స్వార్థములకొరకు
తమ దౌష్ట్యములకొరకు
నేతి బీరల్లాంటి
సంఘాలు నెలకొల్పి
నిజమైన సంఘాలు
నీరసం బొనరింప
మితవాద నాయకులు
సృష్టించుచున్నారు
మెలకువతొ కనిపెట్టి
కొట్టకుంటే దెబ్బ. పీ. రా.

ఎన్నోమారులు నిన్ను
మోసాలు చేసారు

భేదాలు పెంచారు
నీ పెంపు గూల్పంగ
అట్టి పెద్దలకీవు
నీతి గరపకపోతే
కొట్టకుంటే దెబ్బ ని. రా.

ధీరతతో వీరతతో
బాలకేసరిలాగా
శత్రువులపై దుముక
రావోయి కర్షకా
రణరంగమున దుముక ని. రా.



# ఎర్ర బావుటా ఎత్తే వరకే

కూలీలారా! రైతుల్లారా!
డిక్టేటర్ల నిరంకుశత్వము
అధికారాంధుల అక్రమ చర్యలు
జమీందారుల సంపదంధత
సుత్తీ కొడవలి ఎత్తేవరకే కా. క.

రక్త పిపాసుల రక్కస కృత్యాల్
భూమీధవుల పశు ప్రవృత్తి
కోటీశ్వరుల క్రూర పద్ధతి
ఎఱ్రబావుటా ఎత్తేవరకే కా. క.

లంచగొండుల గదమాయింపులు
పోలీసోరి పురమాయింపులు
పాలకజాతుల ఫిరంగిదెబ్బలు
పీడితజాతుల జయధ్వానములు
ఎఱ్రబావుటా ఎత్తేవరకే కా, క.

(1930)

# రైతాంగశక్తి

మమ్మెవ్వరాపగలరోయ్
మమ్మెవ్వరడ్డగలరోయ్

నాగేలు పైకెత్తి
కొడవలటునిటు ద్రిప్పి
ప్రళయ రుద్రునిలాగ
పరుగిడుతు వస్తుంటె ॥ మమ్మె॥

పొలియొ పొలియో అంటూ
పొలికేక లిడుకుంటు
ఎలయ ఛండికవోలె
విరగబడి వస్తుంటె॥ మమ్మె॥

పంట పొలములు బండే
వడ్లగాదే హుళక్కి
ధనధాన్యము సున్నజేసి
ఎదురొస్తుంటే॥ మమ్మె॥

ఎంతొకాలంనుండి
ఇంకి మాలోనున్న
శౌర్యంబు, ధైర్యంబు
రాజాధిరాజులను సొమ్మసిలచేయంగ
చకచకా వస్తుంటె॥ మమ్మె॥

రైతాంగజ్వాలలే
రైతాంగపక్షమే
ప్రళయాగ్ని కీలవలె
ధ్వంసంబు చేయంగ
ధాటిగా దండెత్తు॥ మమ్మె॥

మా చీమునెత్తుటితో
యీ హస్తికలబలిమి
ధనమందాంధులు మమ్ము
అవమానమొనరించ
అణచివేస్తామంటు
పరుగిడుతు వస్తాము॥ మమ్మె॥

సామ్రాజ్యవాదంబు
సమసిపోవాలింక
ధనికవాదంబింక దగ్ధమైపోవాలి
రైతాంగ నిజశక్తిదగిలి మండుచునుండ॥ మమ్మె॥

విశ్వభావనమాది
విశ్వలక్ష్మిమాది
విజయంబు మాదంటు
రణభేరి మ్రోగిస్తు
రంయ్యిమని వస్తుంటె॥ మమ్మె॥

(1939)

# అడ్డేది! ఎదురేది!

రైతులశక్తి కార్మికశక్తి
దేశముక్తికి దివ్యతారకము   రైతు.

ఆకలిమంటకు అగ్గినిప్పురా
కూలీరైతుల ఘోషతగిలెనా
కూలిపోవును రాజ్యాలన్నీ
పటాపంచలౌ వైభవమంతా   రైతు.

రయితుక్రోధమూ కార్మికక్రోధము
ప్రళయతాండవము పూంజిదారులకు
జమీందారులకు సింహస్వప్నము   రైతు

కూలీరయితులు చేతులుముడిచిన
లోకాలన్నీ ఘోషిలిపోవును
దిక్కుదిక్కునా ఆకలిమంటా
కోటీశ్వరులకు చక్రవర్తులకు   రైతు.

రయితులప్రేమ కార్మికప్రేమ
విశ్వమంతటా అమృతవర్షమే
విరాజిల్లును దయాధర్మములు
విజయదుందుభులు మారుమ్రోతలిడు   రైతు.

(I936)

# విజయగానము

రైతు కార్మిక రాజ్యస్థాపన
చేయగావలె రెండు రెండో
తాటిఎత్తున పొంగివచ్చెడి
రైతుకార్మిక వాహినీలో
ధననిరంకుశ బలము లన్నియు
దగిలికొట్టుక పోవగానే రైతు.

వృద్ధనాయక దీవెనలతో
యువతులెల్ల రు ముందునడువగ
సోషలిస్టు యువకయోధులు
సంగరంబున ముందునిల్వగ రైతు.

తుంగభద్రా కృష్ణవేణీ
గౌతమీ కావేరికన్యలు
రైతుకార్మిక విజయగానా
లాపనముచే పొంగుచుండగ రైతు.

ఆరరాదీ అగ్నిజ్వాలలు
అణగరాదీ విజయఘోషలు
రైతుకార్మిక రాజ్యస్థాపన
జేసిభాలిలు నంతదాకా రైతు.

తెలుగురయితుల విజయధంకా
తెలుగువీధుల మారుమ్రోగెను
తెలుగుకీర్తి వెలుంగుదిక్కుల
తేజరిల్లెను సూర్యపగదిని రైతు.

వీరభారత " యోధులందరు "
వీరభారతి కండనుండగ
రైతు " భారత శ్రామికులకు "
రైతు రంగా తోడునిల్వగ

(1936) రక్షకుడు.



# జయ భేరి


జయభేరి మ్రోగింది ఓ బీదరైతా
జయగేయములపాడ సాగిరమ్మింకా    జయ

రైతుకొంపదీనుయ రాజులంతాగూడి
ఆలోచనలుచేస్తే యణచివేశానని.    జయ

కర్షకులుగెల్చారు కదనరంగమునందు
భరతవిద్వేషులు పారిపోయారంచు.    జయ

పువులదండలువేసి పూజాద్రవ్యాలతో
మంగళాగానంబు మననంబుజేయంగ.    జయ

విశ్వరూపముమాది విశ్వభావనమాది
విశ్వలక్ష్మిమాది విజయంబుమాదని.    జయ



## శవాలకూడు

కష్టజీవులా । రక్తంపిండి
శవాలకూటితో । జీవించేటి
ధనమాదాంధులను । భావనచేస్తె
విప్లవభావాల్ । వేగిరించవా

## ఎర్రబావుట

ఎత్తవోయి ఎర్రబావుట
వీరగంధము మేనబూయుము
రక్తతిలకము నొసటదిద్దుము
ఎత్తవోయి ఎర్రబాఉట

## కర్మము

మతం మత్తుతో మైకంకమ్మి
రైతు కార్మికుల దోచేమతము
కర్మకర్మయని । కార్మిక జాతిని
నిరంతరంబు కాల్చే కర్మము

## ఎగ్గెత్తిండోయి ఎగ్గెత్తిండి

సామ్యవాదమే జగతిరక్షణకు

జగతి దుస్థితిని । భేదించుటకు

సూటిమార్గమని । డంకాగొట్టి ఎగ్గెత్తిండి



# విజయఢంకా

1 విద్యార్థి మండలి । విజయఢంకా
విశ్వమంత । ప్రతిధ్వనించెను
విద్యార్థి వీరుడ । తెలుసుకొని
ధీరత్వమున । విలసిల్లుమా వి॥

2 మిత్రమండలి । యుద్ధమందున
ఇటలి స్వాతంత్ర్యో । ద్యమంబున
కత్తికలముల । పదునుజూపి
వీరమరణ । ప్రాప్తిగాంచిన వి॥

3 జర్మనీ సమరాంగణంబున
టర్కి స్వారాజ్యోద్యమంబున
ప్రాన్సుయుద్ధ ప్రపంచమంద
సమాన సాహసస్ఫూర్తి వెల్గిన వి॥

4 స్పెయిను విప్లవజ్వాలలందు
జపానురాక్షస దంష్ట్రలందున
ధైర్యమున ఎదురొడ్డి
బలియై కీర్తిగాంచిన

5 సామ్రాజ్యవాదుల పొగరుడించి
దోపిడీదుల గర్వమడిపి
సోవ్యటు రాజ్యాన్ని దెచ్చిన
వీరరష్యా యోధులగు వి॥

# హెచ్చరికలు

కూలీగోడును కండ్లతో జూచి
కుములుచు క్రుందే బీదయువకుడా !
కార్మిక కర్షక ! జాగృతికొరకై
పరితపించవోయ్ పరితపించవోయ్


*                    *                    *

ఆకలిబాధతొ అల్లల్లాడే
కన్నబిడ్డల కడుపులు చూచి
ఆర్తితొగ్రుందే । అనాధమాతల
వుసురెప్పటికి । ఫలించునో ఏమొ ?

*                    *                    *

సామ్యవాదమా ! జోహారంటూ
ఆకలిమంటలు ! అల్లల్లాడే
కార్మికలోకమ్ ! కదలండోయ్
పీడనుగూర్చే ! బూర్జువవర్గమ
జాగ్రత్తంటు ! జాగ్రత్తంటూ

రైతాంగగాయకుడు



అప్పారావు

# జ్యోతిర్మయి *


## తొలిమాట

గీ. బాలికా ! ఆత్మగౌరవభంగమనిద
లంతువో లేక ప్రాచీన రాజవరుల
కపయశః పాత్రమని మన మందు గలత
జెందవో, యేమొకాదుసుమా ? జీర్ణమైన
భారతఖండసామ్రాజ్య గౌరవంబు
తొంటిసెలవున నెలకొల్పి తొడరి యాంధ్ర
బాలలోకైక సన్మాన పాత్రయనెడి
ఘనతదక్కింపగాజేయ గలవుసుమ్మి
సంశయంబేల వినుమెందు సాటిలేని

* ఈపుస్తకాన్ని 1933 లో వ్రాసాడు .అందులోని కొన్ని భాగాలను ఇచట తిరిగి ముద్రించుచున్నాము. దీనికి శ్రీ ఉమర్ అలీషా కవి వ్రాసిన ఆశీర్వాదాన్ని, రచయిత ఇష్టాగోష్ఠి వేరొకచోట ప్రకటించుచున్నాము.

యా మహాధైర్యగాంభీర్య క్షీమపౌరు
షప్రతాపముల గడించి సమరభూమి
జిచ్చు పిడుగులవలె నరి సేనజీల్చి
జగతినాచంద్ర తారార్క జయముగొనిన
రాజపుత్రులకీర్తి సామ్రాజ్యములకు
గారణము చారణీ సంఘఘనతగాదె ?
కాన నీకీర్తికేలోటు గానరాదు;
అంధ్రతనయుల సత్కీర్తి యలరనాంధ్ర
మాతకొమరుల దీవెనల్ మనుపునట్లు
భావి భారతపుత్రులు ప్రథితశౌర్య
మానధనులను పేర్వాసి మహిమ దసర
భరతభూమికి సౌభాగ్య భాగ్యమమర
వీరతంగొల్పు చారణీ వేషమూని
పల్లెపదములనెల్గెత్తి పాడుకొనుచు
నాంధ్రబాలిక ! పల్లెల కరుగుమమ్మ

రైతాంగ గ్రంధమాల స్థాపకులు



ఆచార్య రంగాగారు

# పృ ధ్వీ రా జు

గీ. ఖండనము క్షత్రియాధమ దండనమ్ము
కొరకు నిర్మింపబడెనొనా గఱకుచంద్ర
హాసమును గేలనెత్తి భయంకరముగ
లీల జయచంద్రు సత్వంబు తూల వాని
సైన్యము కలంగ సంయుక్త చావదోడు
గాగ బిరుదుమగండల గర్వ ముడిపి
దండధరు పాలికింబుచ్చి గండుమిగులు
పృధ్వీరాజేంద్రు వీర్యగాంభీర్యశౌర్య
పాటవము భారతావనిన్ మాటువడియె
నతడు పాలించు వేళయే యార్యభూమి
కదిజగద్రాజ్యరమణీయ మదియనింత
జీవశక్తుల గ్రుమ్మర జేయువర్ష
పాతమా ఉమహాపుణ్య మెప్పట్ల నరిగె
నెన్ని జన్మంబులకునైన నెఱుగగలమె ॥

# దుర్గాదాసు

గీ. మీసములుద్రిప్పి కనులెర్రజేసివిలయ
కాలరుద్రుని గాంభీర్య కలనమించి
సప్తపాథోధులు కలంగ జగతినెట్టి
ఘోషజొప్పమె తద్ఘోష కూర్మిమించు
భాషణంబులనెవడు నన్బట్టువాడు
ఓరియౌరంగజీబ ! యోరారి దుష్ట !
సజ్జనవిభూషితుడు తండ్రి షహజహాను
జంపసమకట్టవే? అన్న జంపవొక్కో?
కరకుకటికిని యా పాప కర్మమివుడె
యనుభవింప వధించెద నంచుగేల
గత్తిఝళిపించె బాదుషా చిత్తమద్రువ
యడలి మొవమూల గ్రుక్కుమి న్కకయుండ
బిరికిపందవు నినుజంపి వీరఘామి
తారణంబైన యీఖడ్గ ధార నళుచి
గానొనర్ప నటంచు బి రాననేగె;
స్వీయధర్మాభిరక్షణ స్థిరవిహారి
ధర్మమూర్తి దుర్గాదాసు ధైర్యపటిమ
లేశమాత్రంబు సాధింపలే రిదేమొ ?
ఆధునిక గర్హ్యదుస్థితి యజ్ఞులైన
యాంధ్రయువజన నయనలక్ష్యంబుగాగ

# జి జి యా బా యి

గీ. ధీర! జగదేకసత్కీర్తి నందశౌర్య
ధైర్యములనుగ్గుబాలతో దనయుబెంచి
యామె బిడ్డడా? వీరవి హారమొప్ప
గరకు తురకలఖండించి కదనమందు
నరిజనభయంకరుండవై యతులకీర్తి
నందు మనిబలియొసంగె నీ యార్యభూమి
కీమెలోకైక మహనియ, యిట్టితల్లి
కన్నకానుపె కానుపు గాక సాదు
సంఘముల కార్తిగొలుపున సాధుకన్న
కడుపు వ్యర్థంబుగాదొకో కాంతియనుచు
నార్యరమణులు హారతులందియొసంగ
బ్రతిగృహంబున బ్రతిమల బ్రతిభవెల్లు
జీజియాబాయి చనియెను జింతలనెడి
కారమబ్బులు గ్రమ్మెను గగనమందు
భారతీయాస్య మంజుల బ్రతిభమాసె;
నీశ్మశానంబునందున నేమిసేయ
వలనుపడ దెంతజూచిన వడిగనరిగి

# ఛత్రపతి శివాజి

గీ. కెవ్వుమని సేనలార్వంగ గేలగత్తి
నెత్తిశతృనృపాలుర జిత్తులెల్ల
నడవిపాల్గాగ భయదమౌ నాహవోర్వి
స్వేచ్ఛవీరవిహారంబు జేసి విజయ
దుందుభులు మ్రోయ స్వాతంత్ర్య దుర్గములను
దెచ్చియుంపార ప్రజల కం దిచ్చునాటి
జీజియాబిడ్డ శౌర్యంపు చిన్నలైన
నెమకిజూచిన గన్పట్ట నేరపకట ;
యామహాశౌర్యమెచ్చోట నణగిపోయె
మించుశ్రీమించు యశము దే మిత్తిమ్రింగె
నో యిసీ ! యాంధ్రబాలికా ! యోయనుటకు
నోచుకొనదాయె నీతల్లి నోములన్న
హృదయమున బొంగిపొరలెడు యదురువుట్టి
వేడినిట్టూర్పులే సదా వేడ్కలయ్యె
ఘనసుషుప్తిని స్వప్నముల్గాంచుచున్న
యాంధ్రబాలుర యజ్ఞాన మణగద్రొక్కి
యాత్మగౌరవ మొలుకాడ నవనరతము

# కృష్ణదేవరాయలు

గీ. కృష్ణదేవుండు వసుధ శ్రీ కృష్ణదేవ
రాయడై జన్మ మొకొని రాజ్యపాల
నమ్మొనర్చుచునుండె ధన్యతజెలంగ
ప్రజలునుతియింప సత్కీర్తి ప్రతిభవెలయ
గననకన్నియ ముద్దుల కరవుదీర
నాంధ్ర సామ్రాజ్యకన్యక నాదరించి
సరస సంగీతసాహిత్య సరసిముంచి
తేల్చినట్టి మహాభోగి ధీవిశాలు
డాంధ్రభోజాభి ధానుండె యస్తమింప
నాంధ్ర సామ్రాజ్య జయశబ్ద మాంధ్రయోధ
వరులకును జయయనిపల్కు పరమపుణ్య
కాలమాఽకాలగర్భసం క్రాంతమయ్యె
నాదినంబుమదిందోప నడలువుట్టి
కనుల బాష్పాంబువులు గ్రమ్మ; గాంతిబాసి
నట్టి యీ విజనిస్థలి యటవిసీమ
గ్రుమ్మరినలాభమెవ్విధి గూడరాదు;
ఆంధ్రయువజన హృద్వీధి నందెవైచి భ॥

# అ ప్పా జీ

గీ॥ ఆంధ్రరాజ్యేందిరారామ యద్వితీయ
మైన యీతనిరాజకీయంపుకార్య
కలన గృష్ణరాయలభుజ స్కంధమెక్కి
నవ్యవైభవ విస్ఫూర్తి నాట్యమాడె
నితడు లేకున్నతనికే గతినిగల్గు
ప్రతిగనగరాని యేకాత పత్రవిభవ
కీర్తిగరిమంబు చారిణీ గీతికలకు
జవులుమిగులంగ బుట్టించు శక్తియున్నె ?
తిమ్మరుసులేని కృష్ణుని దీప్తియేడ
ననుచు బ్రజలాడు మాటల నాలకించి
చిఱునగవు నెమ్మొగంబున జిందులాడ
దయ నిరాడంబర స్ఫూర్తి దలనుబ్రాల్చి
యరుగుప్రతిభాఢ్యు డరిగెన య్యమరవురికి
లేడులేడింక నప్పాజి లెండులెండు
కూళలారా! యనుచుగోడి కూతగూసె;
ధర్మసామ్రాజ్య నాశనో దాగమతుల
వంచకులమానసంబుల పనటదీదె;
సత్పురుషపాళి కుత్పాత సమితిదోచె
నకట ! దేశంబు నలువంక లలముకొన్న
యీదృశదురంత విషవల్లు లెండిపోవ



(1930) శెట్టిపల్లి

# ఖడ్గ తిక్కన

గీ. తిక్కనా ! యెంతయభిమాన ధీవిశాలి
వోయి యిటు ధర్మసతి యటు సురగుణాఢ్య
మాత చిన్నచేతలకె నీ మనము చిన్న
బుచ్చుకొని సంగరస్థలి బోయిపడితె !
యుఋము రుఋమలేదే ! విలయ మూర్విదోప
స_ప్త పాథోధులుకలంగి జగమువడక
లేదె ? నీవంటి వీరుండు లేమిజేసి
ప్రకృతియెంతటి కాఠిన్య భావయౌర !
భావిభారతపుత్రులు భాగ్యభోగ
జాలములమున్గి యనియన జడియుచుండు
రట్టివేళను వనిత లీ యద్వితీయ
పద్ధతిని బోవవలయును ప్రథితబుద్ధి
ననెడి హితవునుబోధింప సని దొరంగి
తంతియేగాని భయమున నీగిగాదు;
ఖడ్గతిక్కన ! నీవెంత ఘనుడవోయి
.... .... ........ .... ........ .... ....
అట్టితిక్కన వీరుడై యరుగ దివికి
నాంధ్రజగమున దౌర్భాగ్య మవతరించె.
నతనిమార్గంబు సోదరు లనుసరింప

# కన్యకాదేవి

గీ. మానసంరక్షణార్థమై ప్రాణమైన
దృణమువలె బాలికలు వ్రేల్చు దిట్టలంచు
బూతభారతఖండవి ! ఖ్యాతినెరప
హితమెఱింగింప జన్మించె నింతిమిన్న
కన్యకాదేవి యెంతటి గడసరియొకొ
విష్ణువర్ధన రాజేంద్ర విభవమెల్ల
మానవసంరక్షణార్థమై మాపికాదె
వీరసామ్రాజ్యలక్ష్మితో వియ్యమందె
నరయుమోయాంధ్ర వీరుడా ! ఆర్యభూమి
మానమే పోవుచోనింక బ్రాణమేల ?
ప్రాచ్యవిజ్ఞానమంతయు బాడువడుట
నాంధ్రుల మహత్తరవ్యక్తి యారనుండె
రండహోయంచు గర్తవ్య ఖండనమున
జీర్ణప్రాచీన ప్రతిభను జేరుడనుచు

# కవయిత్రి మొల్ల

గీ. స్వీయకావ్యామృత రసంబు చిందులాడ
భువనమానందసాంద్రమై కవిజనాళి
డెందములు భాసవిప్లవ మందజగతి
నూత్న సౌందర్యమునుఁ జొన్పు నోమునోచి
నవరసంబులఁజేర్చి యీ నాతిభళిర
వ్రాసెనొకా! జగత్తు నె చాసనంగ
రామచరితంబు రమణీయ రచనమించి
యిమ్మహారచనాప్రౌఢి యెరుగ మెందు
నోట జవులూరదీయని మాటపొంది
కలుచు ముద్దుసామెతలచే గలసి చదువు
వారలను నూత్నరమణీయ వసుధడించు
కవనసంపద గాంచిన గరిత యీమె
స్వర్గముననుండి దీవెనల్ పంపుచున్న
మొల్ల మధురకవిత్వంబు ముద్దునకును
గానుపింప లేదీకాల కర్మమేమొ?
ఆ కవిత్వంబునంగల యనుపమాన
రమ్యభావాలుతేట తెల్లంబుగాగ
నార్యకవయిత్రి విజ్ఞాన మాంధ్రులెఱుగ

# రాజా రామ మోహనరాయి

గీ. కరకు పాషాణకాఠిన్య కలితహృదయ
భావముల సహగమనంబె భావ్యమైన
మోక్షవై భవ పదవికి మూలమనుచు
రోదనము మద్దెలల మ్రోత లోననిముడ
భర్తశవమున భార్యను బట్టికట్టి
దగ్ధమొనరించుచుండెడు దారుణులగు
మనుజరూపరాక్షసుల దుర్మార్గపక్కి-
గని నిరంతరకృషిచేత జెనకివైచి
భారతక్షితి విజ్ఞాన భాస్కరునకు
జోటొసంగిన ధార్మిక సూక్తివేత్త
రామమోహను సౌజన్య సౌమ్యభావ
మెఱుకపడరాదదెచ్చోట మరుగువడెనొ
యామహాత్ముండు దివికేగ నంతలోన
నిమ్మహాతల సౌభాగ్య మెగిరిపోయె
నతని విజ్ఞానదీప్తుల నభ్యసించి
దేశయువకులు నేత్రముల్ దెరచిస్వీయ
పతన దుస్థితివేవేగ బాసికొనగ

# తుదిమాట

గణపతిమహీశు సతుల సత్కాంతికీర్తి
రుద్రమాంబ భుజాస్ఫూర్తి రౌద్రమూర్తి
కాకతిప్రతాపకేసరి గర్జనమున
లొంగిపొరలెడి యాంధ్ర వి స్ఫూర్తియేమి ?

.... .... .... .... .... .... .... ....

ఆంధ్రరమకిట్టి దౌర్భాగ్య మమరెచిట్టి
తల్లి ! లేలెమ్మ సోమరితనము నడచి
ఘోరమగు క్షామచిహ్నాల గూల్చివైచి
యాంధ్ర భూస్థలి యౌన్నత్య మరయరండు
రండొహోయంచు నాంధ్రుల రక్షజేయ
భరతభూమికి సౌభాగ్య భాగ్యమమర
వీరతంగొల్పు చారిణీ వేషమూని
పల్లెపడముల నెల్గెత్తి పాడుకొనుచు
నాంధ్ర[illegible]లికా ! పల్లెల కరుగుమమ్మ

# రైతాంగ గ్రంధమాల

హరిజన నాయకుడు

రచయిత :—యన్. జీ. రంగా. యం. ఎల్. ఏ.

| | | | | |
|---|---|---|---|---|
| | వెల | 0 | 8 | 0 |
| రైతు భజనావళి | .... .... | 0 | 2 | 0 |
| తెల్చుకోదగిన పట్టాభి | .... .... | 0 | 4 | 0 |
| ఆకలి మంటలు | .... .... | 0 | 2 | 0 |
| జ్యోతిర్మయి | .... .... | 0 | 2 | 0 |

# అచ్చుకావాల్సిన గ్రంధాలు

త్రిపురీ సమస్య .... ....

అంబుల పొది .... ....

జ్యోతిర్మయ నక్షత్రాలు .... ....

# క్రాంతి

రైతుల, కూలీల రాచకీయ హక్కుల
కోసరం పోరాడే పత్రిక

ప్రపంచ రాచకీయాలను చక్కగా
బోధిస్తుంది

## ఇంతెందుకు

కాపీ తెప్పించుకు మీరే
తెలుసుకోండి

సం. చందా **4-0-0** విడి పత్రిక అణా.